## విజయవిద్యాలయ స్కూల్ భూమిని పరిరక్షించుకోవాలి

**తాండూరు, జూన్ 9, ప్రభాతవార్త :** తాండూరు పట్టణంలోని విజయలవిద్యాలయ స్కూల్‌కు సంబందించిన విద్యార్థుల ఆట స్థలాన్ని స్కూల్ యాజమాన్యంతో పాటు, భూయజమానుల మంటు కొందరు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని జనసత్తా వేల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు సూరజ్‌సింగ్ ఠాకూర్ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దీస్టిలో ఉంచుకొని విజయవిద్యాలయ స్కూల్ భూమిని పరిరక్షించుకోవాల్సి న అవసరం ఉందని అన్నారు. ఆదివారం ఓ ప్రకటనలో ఆయన మీడియాకు తెలిపారు. ప్రభుత్వ స్థలాన్ని స్కూల్ యాజమాన్యానికి విద్యార్థుల చదువుకోసం అప్ప గించడం జరిగిందని తెలిపారు. ఈ స్థలాన్ని దేరుద్దేశ పూర్వకంగా, దుర్వినియోగ పరిచేందకు స్థలాన్ని ఆక్రమించి విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై వెంటనే క్రిమినల్ చర్యలు చేపట్టాలని సూరజ్‌సింగ్ ఠాకూర్ డిమాండ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను కూడా లెక్కచేయకుండా కోర్టు దిక్కారానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. వెంటనే రెవెన్యూ అధికారులు స్పందించి భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

**కొల్చారం, జూన్9 ప్రభాతవార్త:** కొల్చారం మండల పరిధిలోని దేవుని వెంకటాపూర్ గ్రామంలోని వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా కన్నుల పండుగలా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవాన్ని వెంకటేశ్వర ఆలయ అనువంశిక ధర్మకర్త పట్వారి ప్రసాదరావు ఆధ్వర్యంలో కులచాల కృష్ణశర్మ మంత్రోచ్చరణల మధ్య జరిపారు. ఉదయం నుండి ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణం అనంతరం మహిళలు స్వామివారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా శ్రీ వెంకటేశ్వర నామస్మరణతో మారుమ్రోగింది. అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. పురోహితులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్వారి ప్రసాదరావు మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర స్వామి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి మృతి

### భర్త నెహ్రూనాయక్‌కు గాయాలు

**బొంరాస్‌పేట్, జూన్9, ప్రభాతవార్త :** ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో గ్రూప్-1 పరీక్ష పూర్తిచేసుకొని తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ద్విచక్రవాహనంపై నుండి కిందపడటంతో ఈ ప్రమాదంలో పంచాయతీ కార్యదర్శి సుమిత్ర ప్రమాద స్థలంలోనే మృతిచెందడంతోపాటు భర్త నెహ్రూనాయక్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రూప్-1 పరీక్ష ముగించుకోని స్వగ్రామం దేవులా నాయక్‌తాండకు వస్తుండగా ధరూర్ మండలం ఘట్టేపల్లి గ్రామం దగ్గర ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. బొంరాస్‌పేట్ మండల బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు నెహ్రూనాయక్ పనిచేస్తున్నారు. భార్య సుమిత్ర బొంరాస్‌పేట్ మండలం లగచర్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించడం జరిగిందని అనంతరం ప్రస్తుతం యాలాల మండలం అచ్యుతపూర్ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. చిన్న వయస్సులో సుమిత్ర మృతిచెందడంతో దేవులానాయక్‌తాండలో విషాదఛాయాలు అలుముకున్నాయి.



## రామోజీరావు అంత్యక్రియల్లో పాల్గొన్న ప్రముఖులు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త :** ఈనాడు గ్రూఫ్ ఆఫ్ చైర్మన్ రామోజీరావు అంత్యక్రియలు ముగిశాయి. ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రామోజీ ఫిల్మ్‌సిటీలోని స్మృతి వనంలో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో పోలీసుల గౌరవ వందనంతో కి.శే.రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించారు. శనివారం నానక్‌రామ్ గూడలోని స్టార్‌హాస్పిటల్ నందు అనారోగ్యం కారణంగా మరణించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలను అనుసరించి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక, రాచకొం



రామోజీరావు అంత్యక్రియల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు

డ సి.పి.లు రామోజీరావు అంత్యక్రియల ఏర్పాట్లు పర్యవేక్షించారు. రామోజీరావు అభిమానులు, సినీ ప్రముఖులు, రాజకీయ వేత్తలు, రామోజీ సంస్థల ఉద్యోగులు రామోజీ రావును చివరి చూపు చూడడానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర వ్యవసాయశాఖ, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి, రంగారెడ్డి, నారా లోకేష్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పోచారం శ్రీనివాస్, వెనిగండ్ల రాము, జూపల్లి కృష్ణారావు, అరికపూడి గాంధీ, తీగల కృష్ణారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలికపై అత్యాచారం.. కేసు నమోదు

**యాలాల జూన్9, ప్రభాతవార్త :** బాలికపై అత్యాచార యత్నం జరిగిన సంఘటన యాలాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నారంలోచోటు చేసుకుంది. యాలాల ఎస్.ఐ.విఠల్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి..చెన్నారం గ్రామానికి చెందిన గడుసు సాయిలు అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బాలికకు మాయ మాటలుచెప్పి అత్యాచార యత్నం చేశాడు. రెండ్రోజుల క్రితం నుంచి బాలికను శారీరకంగా వేధిస్తూ ఉన్నాడు. ఇదే విషయాన్ని సదరు బాలిక తన తల్లితో వివరించి బోరుమంది. దీంతో బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇదిలా ఉండగా అత్యాచారం చేసిన నిందితున్ని కేసు నుంచి తప్పించేందుకు కొంతమంది నాయకులు పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

## జాతీయ రహదారి తారు రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

**షాద్‌నగర్, జూన్ 9, (ప్రభాతవార్త) :** పట్టణ ముఖ్యకూడలీ నుంచి అన్నారం వై జంక్షన్ వరకు కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఆదివారం తారు రోడ్డును వేయడం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై తారు రోడ్డు పనులను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాలైనా పట్టణాలైనా అభివృద్ధి చెందాలి అంటే ముఖ్యంగా రహదారులు బాగుండాలన్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మించే ఈ రహదారిని నాణ్యతతో నిర్మించాలని, కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డికి సూచించారు. 4.9 కిలోమీటర్లు నిర్మించి ఈ పాతజాతీయ రహదారిని సుమారు 45 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నాట్లు ఈ సందర్భంగా మీడియాకు వివరించారు. ప్రజలకు ఇబ్బందులు కగకుండా వీలైనంత త్వంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు కాంట్రాక్టర్ వెంకట్‌రెడ్డి, ఏఈ రాజశేఖర్, సీనియర్ నాయకులు బాబర్‌ఖాన్, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, వార్డు కౌన్సిలర్ కృష్ణవేణి, లతాశ్రీ శ్రీశైలం, ఆశన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

**ఘట్‌కేసర్, జూన్ 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలంలో ఆదివారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-1 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఘట్‌కేసర్ మండలంలో 13 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్షలును అధికారులు సజావుగా నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్ విజ్ఞాన్‌మహిళా, అవుషాపూర్ ఆలోరా, విజ్ఞానభారతీ రెండు కేంద్రాలు, ఎదులాబాద్ మేఘా, అంకుశాపూర్ ఏసీఈ రెండు కేంద్రాలు, , వెంకటాపూర్ అనురాగ్ విశ్వవిద్యాలయం రెండు, చౌదరిగూడ ప్రిన్స్‌టన్, నల్ల నర్సింహ్మారెడ్డి, కొర్రెముల సిద్దార్థ, కాచవాని సింగారం దివ్యానగర్ నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపల్, మండలం పోచారం మున్సిపల్, కీసర మండలం చీరాల లోని గీతాంజలి కళాశాలలో కలిపి మొత్తం 16 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలో మొత్తం 12,326 మంది అభ్యర్థులకు గాను 8,750 మంది హజరుకాగా 3,576 మంది పరీక్షకు గైర్హాజరు అయ్యారు.

# గ్రూపు 1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతం

### రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్‌లలో పకడ్బందీగా ఏర్పాట్లు

### ఉమ్మడి జిల్లాల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కె.శశాంక

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఆదివారం గ్రూపు 1 ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ శశాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని సంజయ్ గాంధీ మెమోరియల్ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు, బాలాపూర్‌లోని తీగల కృష్ణారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కొనసాగుతున్న గ్రూపు 1 పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్ష నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నపత్రాలను తెరిచారా, లేదా అన్నది నిర్ధారణ చేసుకున్నారు. బయోమెట్రిక్ హాజరు సేకరణ కోసం ప్రత్యేకంగా నియమించినబడిన ఇన్విజిలేటర్లతో, బయోమెట్రిక్ సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రాథమిక చికిత్స వసతులతో కూడిన ఏ.ఎస్.ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. అభ్యర్థుల హాల్ టికెట్లను ఆధార్ వంటి గుర్తింపు కార్డులతో సరి చూసుకున్న మీదటే, మెయిన్ ఎంట్రెన్స్ వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించడం జరిగిందని పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎగ్జామ్ హాల్లోకి సెల్‌ఫోన్లు, స్మార్ట్ ఫోన్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. కలెక్టర్ ఆయా పరీక్ష కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూ.చ తప్పకుండా అమలు చేస్తూ, ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్ష జరిగేలా పకడ్బందీగా పర్యవేక్షణ చేయాలన్నారు. పరీక్ష సమయం ముగిసేంత వరకు ఎవరూ కూడా బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. కాగా జిల్లాలో 75.01శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని కలెక్టర్ తెలిపారు. మొత్తం 55692 మంది అభ్యర్థులకు గాను 41774 మంది పరీక్ష కాయగా, 13918 మంది గైర్హాజరయ్యారని వివరించారు. అంతకుముందు జిల్లాలోని 6 పోలీస్ స్టేషన్‌లలో ఏర్పాటు చేసిన 7 స్ట్రాంగ్ రూమ్‌ల నుండి కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమా ఆయా రూట్ల వారీగా ప్రశ్న పత్రాలు, ఇతర సామాగ్రిని పరీక్షా కేంద్రాలకు తరలించారు. ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష కొనసాగగా, పరీక్ష ముగిసిన అనంతరం అభ్యర్థుల ఓ.ఎం.ఆర్ షీట్లు, ఇతర మెటీరియల్‌ను నిబంధనలకు అనుగుణంగా సీల్ వేసి, పోలీస్ ఎస్కార్ట్ నడుమ తిరిగి స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. ఈ ప్రక్రియను అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, భూపాల్ రెడ్డిలు క్షేత్రస్థాయిలో ఉండి పర్యటించారు. మొయినాబాద్, ఇబ్రహీంపట్నంలోని పరీక్షా కేంద్రాలను సైతం తనిఖీ చేశారు. జిల్లా యంత్రాంగం ముందస్తుగానే విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో, సజావుగా ప్రిలిమ్స్ పరీక్షలు ముగిశాయి. అన్ని జిల్లా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. కలెక్టర్ సూచనల మేరకు అభ్యర్థులకు ఉపయుక్తంగా ఉండేలా హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద సమగ్ర వివరాలను, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలను క్షుణ్ణంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

### వికారాబాద్ జిల్లా కేంద్రంలో..

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లాలో ఆదివారం సాయి డెంటల్ కళాశాల, శ్రీ అనంత పద్మనాభ కళాశాల, సిదార్థ జూనియర్ కళాలల నందు నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి సందర్శించి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా గ్రూప్-1 పరీక్షల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారన్నారు. జిల్లాలో వికారాబాద్7, పరిగి 2, తాండూరు 4 చొప్పున మొత్తం 13 సెంటర్‌లు ఏర్పాటు చేశామని, మొత్తం 5468 మందికి గాను 4277 మంది పరీక్షకు హాజర య్యారని, 1191 మంది గైరహాజరయ్యారని పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడం జరిగిం దిన కలెక్టర్ అన్నారు.

వికారాబాద్ జిల్లాలో విశ్వభారతీ డిగ్రీ కళాశాల, గౌతమి జూనియర్ కళాశాల, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ స్కూల్ కొత్త గడిల నందు ఏర్పాటు చేసిన గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్ష కేంద్రాలను వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆదివారం సందర్శించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...గ్రూప్-1 పరీక్షల నిర్వహణ కోసం ఉదయం అధికారుల ఆధ్వర్యంలో స్ట్రాంగ్ రూం ఓపెన్ చేసి పరీక్ష పేపర్లను పరీక్ష కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాలలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, పరీక్షలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఓ వాసు చంద్ర, ఏఓ అమరేందర్ సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

### మొయినాబాద్ మండల కేంద్రంలో..

**మొయినాబాద్, జూన్ 9, ప్రభాతవార్త** మొయినాబాద్ మండల కేంద్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు మొయినాబాద్ మండల తహసీల్దార్ గౌతమ్‌కుమార్ తెలిపారు. ఆదివారం రా ష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన టువంటి గ్రూప్-1 పరీక్ష కేంద్రాలు మొయినాబాద్ మండలంలో జెబిఐఈటి ఇంజనీరింగ్‌కళాశాలలో మరియు కేజీ రెడ్డి కళాశాలలో సెంటర్లు నిర్వహించారు. ఆదివారం మండలంలోని తొమ్మిదవ పరీక్ష కేంద్రంలో 5928 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా 3888 మంది హాజరయినట్లు, మొత్తం 65.58శాతం పరీక్షకు హాజరయ్యారని తెలియజేశారు. ఈ పరీక్షా కేంద్రాలను రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ ఏఏఎస్ పరిశీలించారని ఎక్కడికక్కడ ప్రశాంతంగా పరీక్ష కేంద్రాలు కొనసాగాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది బందోబస్తును ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రానికి వచ్చేటువంటి వారికి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రంలో కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షకేంద్రంలో సిబ్బంది ప్రతి ఒక్కరూ వారివారి పనిని సక్రమంగా నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పరీక్షను కొనసాగించినట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ పరీక్షా కేంద్రాన్ని తహసీల్దార్ గౌతమ్‌కుమార్ రీజినల్ కోఆర్డినేటర్ రామ్మోహన్‌తో కలిసి పరీక్షకేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల్లో ఉన్నటు వంటి ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. పరీక కేంద్రంలో ఈ సారి ప్రతి అభ్యర్థి యొక్క బయోమెట్రిక్ వివరాలను నమోదు చేశారో అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ పర్యవేక్షణలో చేవెళ్ల ఏసిపి శ్రీకిషన్ స్థానిక ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి మండల తహసీల్దార్ గౌతం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఇబ్రహీంపట్నంలో 12355 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు

**ఇబ్రహీంపట్నం, జూన్ 9, ప్రభాతవవార్త:** ఇబ్రహీం పట్నంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. పోలీసులు పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. పరీక్షలు 10:30గంటలకు ప్రారంభమయ్యాయి. కేంద్రంలోకి అభ్యర్థులను ఉదయం 10:00గంటల వరకు పోలీసులు అనుమతించారు. మూడు నిమిషాలు ఆలస్యమయిందని పలువురు అభ్యర్థులను పోలీసులు పరీక్షా కేంద్రంలోకి అనుమతి నిరాకరించారు. ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల పరిధిలో మొత్తం 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. 15912 మంది అభ్యర్థులు ఉండగా 12355 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. 3557 మంది అభ్యర్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

### మేడ్చల్ జిల్లా కేంద్రంలో..

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 9, ప్రభాతవార్త** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూపు-1 పరీక్షా కేంద్రాలను మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించి పరిశీలించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రూపు-1 పరీక్షలు ప్రశాంతగ జిల్లాలో నిర్వహించారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ గ్రూపు-1 పరీక్షా కేంద్రాలను ఆదివారం సందర్శించి పరిశీలించారు. జిల్లా పరిధిలోని ఎంఎన్ఆర్ డిగ్రీ అండ్ పిజి కాలేజ్ కూకట్‌పల్లి, ప్రతిభ డిగ్రీ కాలేజ్ కూకట్‌పల్లి, మార్టిన్ హైస్కూల్ బాలానగర్, గ్రూపు -1 పరీక్షా కేంద్రాలను సందర్శించి పరీక్షల నిర్వాహణ తీరును పరిశీలించారు. గ్రూపు-1పరీక్షల నిర్వాహణలో అధికారులు అప్రమత్తంగ వ్యవరించాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు ప్రశాంతంగ, సజావుగ నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. అదే విధంగ జిల్లా అదరనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి జిల్లా పరిధిలోని ఒమెగా డిగ్రీ కాలేజీ, మేఘ ఉమెన్స్ డిగ్రీ అండ్ జూనియర్ కాలేజీ, స్పూర్తి ఉమ్మెన్స్ డిగ్రీ కాలేజ్, శ్రీమేథా డిగ్రీ కాలేజ్, ఉప్పల్, అరోరస్ ఫోస్ట్ గ్రాడ్యుయేషన్ కాలేజ్ మేడిపల్లిలో ఏర్పాటు చేసిన గ్రుపు-1 పరీక్షా కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగ ఏర్పాటు చేసిన 105 గ్రూపు-1 పరీక్షా కేంద్రాలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు వేరువేరుగా సందర్శించి పరిశీలించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగ, సజావుగా జరిగినట్లు వారు పేర్కొన్నారు.



గ్రూపు-1పరీక్షాకేంద్రాన్ని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పాల్గొన్న అధికారులు



పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్



గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు



మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని గ్రూపు-1 పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, పాల్గొన్న అధికారులు

# కోటపల్లి ప్రాజెక్టుకు పూర్వ వైభవం వచ్చేనా?

### మరమ్మత్తుకు నోచుకోని కాలువలు, తూములు
### తగ్గుతున్న సాగు విస్తీరణం
### ఆందోళనలో ఆయకట్టుదారులు
### ప్రాజెక్టుపై ప్రభుత్వం దృష్టిసారించాలి



నిండుకుండలా కోటపల్లి ప్రాజెక్టు

**పెద్దేముల్, జూన్ 9, ప్రభాతవార్త:** అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా కోటపల్లి ప్రాజెక్టు ఆయక ట్టుదారుల పరిస్థితి తయారైంది. కోటపల్లి ప్రాజెక్టు పూర్తిగా నిండిన కాలువలు, తూములు మరమ్మత్తులకు నోచుకోకపోవడంతో నీరంతా వృథాగా పోయి సాగుకు నోచుకోవడంలేదు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అతిపెద్ద మద్యతరహా ప్రాజెక్టు కోటపల్లి ప్రాజెక్టు. కోటపల్లి ప్రాజెక్టు పూర్తి నీటిసామర్థ్యం 24 అడుగులు, ప్రాజెక్టు ఆయకట్టు కింద 9200 ఎకరాల సాగు భూములు ఉన్నాయి. ప్రాజెక్టు నిండిన ప్రతియేటా రబి సాగుకు గాను పెద్దేముల్ మండల పరిధిలోని మంచన్‌పల్లి, కొండాపూర్, మదనంతాపూర్, రెగొండి, రుక్మాపూర్, మంబాపూర్, ఖానాపూర్, బండపల్లి, జనగాంతో పాటు ధారూర్ మండలంలోని గట్టెపల్లి, రుద్రారం, నాగసముందర్, అల్లాపూర్ తదితర గ్రామాలకు సాగునీటిని వదిలేవారు. అయితే కాలువలలో పిచ్చి మొక్కలు మొలవడమే కాకుండా, తూములు, షట్టర్లు మరమ్మత్తులకు నోచుకోక సాగునీరంతా మంచన్‌పల్లి, నాగసముందర్ తదితర వాగులలో వృథాగా పోతోంది. ఫలితంగా సాగు నీరందక చివరి ఆయకట్టు భూములు ఎండిపోయిన దాఖలాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం అతికష్టం మీద 4000 ఎకరాలకు సాగు నీరందు తోంది. మిగతా ఆయకట్టు భూములు ఎడారిలా తలపిస్తున్నాయి. కాలువలు, తూములు మరమ్మత్తులకు నోచుకోక ఇంతకింతకు సాగువిస్తీర్ణం తగ్గుతుండటంతో ఆయకట్టుదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు కాలువలపై సంబందిత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా కాలువలు కబ్జాకు గురువుతున్నాయి. అంతే గాకుండా అక్కడక్కడ ఏర్పాటు చేసిన తూముల, షట్టర్ల పనిముట్లను ఎత్తుకెళ్ళిన పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి. కాలువలు, తూములకు మరమ్మత్తులు చేపడితే చివరి ఆయకట్టు భూములకు నీరందడమే కాకుండా భూగర్భజలాలు పెరిగేందుకు ఆస్కారం ఉంటుందని ఆయా గ్రామాల రైతులు విన్నవిస్తున్నారు. గత కేసిఆర్ ప్రభుత్వంలో ప్రాజెక్టు అభివృద్ధి కోసం నిధులు కేటాయిస్తారని ఎంతో ఆశగా ఎదురుచూసిన రైతాంగానికి నిరాశే ఎదురైంది ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా తలపిస్తున్న కోటపల్లి ప్రాజెక్టుకు అధిక నిధులు వెచ్చించి ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకొచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేయాలని ఆయకట్టుదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ప్రాజెక్టు అలుగు వద్ద పర్యాటకుల సందడి



శిథిలావస్థకు చేరిన కాలువలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారించాలి

### ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్

**కొడంగల్, జూన్ 9ప్రభాతవార్త** ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ 78వ అవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కొడంగల్ పట్టణంలోని ఎస్టీయూ భవన్‌లో 78వ సంఘ అవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్టీయూ సంఘం పతాకాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు అవిష్కరించారు. అనంతరం జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ మాట్లాడుతు ప్రతి పాఠశాలలో పాఠశాల ప్రారంభం నాటికి స్కీవెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్ నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బడులకు ఉచిత విద్యుత్ వెంటనే అమలు చేయాలన్నారు. పిఆర్సీ నివేదిక వేగంగా తెపి ంచుకొని అమలు చేయాలని కోరారు. అన్ని రకాల పెండింగ్ బిల్లులను వారం రోజుల్లో క్లీయర్ చేయాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే కేజీబీవీ, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎంటిఎస్ వెంటనే ప్రకటిస్తు ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల్లో అందరికి న్యాయం చేకూరే విధంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యండి. షఫీ, రాష్ట్ర ఆర్థిక కార్యవర్గ సభ్యులు పవన్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దయాకర్, ఆశప్ప, గోపాల్, కణకాచారీ, లక్ష్మీనారాయణ, అంజిలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశ ప్రగతి మోడీతోనే సాధ్యం : సందీప్

**పెద్దేముల్, జూన్ 9, ప్రభాతవార్త:** దేశ ప్రగతి ప్రదాని నరేంద్రమోడితోనే సాధ్యమని బిజేపి జిల్లా కార్యవర్గసభ్యులు సందీప్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ మాట్లాడుతూ నరేంద్రమోడి దేశ ప్రధానిగా మూ డవసారి ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో అభినందనీయమని అందుకు జిల్లా బిజేపి శ్రేణుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో మూడ సారి బిజేపి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రదానిగా మోడి, కేంద్ర మంత్రులుగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు ప్రమాణ స్వీకారం చేయడం సంతోషదాయకమని అన్నారు. సుస్థిర పాలన అందించడం బిజేతోనేసాధ్య మని అన్నారు.

## కంటోన్మెంట్ ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటా
-ఎమ్మెల్యే శ్రీగణేష్


కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను సన్మానిస్తున్న 1వ వార్డులోని పలు వార్డుల అధ్యక్షులు

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో తమను బారీ మెజార్టీతో గెలిపించినందుకు నియోజకవర్గం ప్రజలకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా బారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఆదివారం 1వ వార్డులోని పలు కాలనీల అధ్యక్షులు శ్రీగణేష్‌ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జంపన రవిందర్, బల్వంత్ రెడ్డిలతో పాటు పలు కాలనీల అధ్యక్షులు పాల్గొన్నారు. అదే విధంగా 6వ వార్డులో కాంగ్రెస్ నేత గడ్డం ప్రవీణ్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీగణేష్‌ను 6వ వార్డుకు చెందిన కాంగ్రెస్ నేతలు ఘనంగా సత్కరించారు.

**1001 కొబ్బరి కాయలు కొట్టిన ఎమ్మెల్యే శ్రీగణేష్**

కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ విజయం సాధిస్తే బొల్లారం డౌటన్ బజార్‌లోని భూలక్ష్మి దేవాలయంలో 1001 కొబ్బరి కాయలు కొడుతానని శపదం చేశాడు. గణేష్ విజయం సాధించిన సందర్భంగా ఆలయ ప్రాంగణంలో 1001 కొబ్బరి కాయలను ఎమ్మెల్యే శ్రీగణేష్, కాంగ్రెస్ నేత నర్సింహన్‌లు కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.

**శ్రీగణేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన నోముల ప్రకాశ్**

కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను మారేడ్‌పల్లిలని న్యూ క్లబ్ అధ్యక్షుడు నోముల ప్రకాశ్, బోయిన్‌పల్లి మార్కెట్ తొలి చైర్మన్ ముప్పిడి గోపాల్‌లు ఎమ్మెల్యేకు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, క్లబ్ సభ్యులు దిలీప్, సాయికుమార్, లక్ష్మణ్ రావ్, మనోహర్ రెడ్డి, చొల్లేటి రమేశ్, ఫని, సునీల్, రవిందర్ తదితరులు ఉన్నారు.

**ఈటల రాజేందర్‌కు అభినందనలు తెలిపిన కొంతం దీపిక**

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:** మల్కాజిగిరి పార్లమెంట్ ఎంపీగా ఈటెల రాజేందర్ బారీ మెజార్టీతో విజయం సాధించినందుకు మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొంతం నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న ఎంపీలు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి అభినందనలు తెలియజేశారు.

## ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి
-సిఎంకి తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం విజ్ఞప్తి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమా శ్రీనివాస్

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**
గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం ప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలలో చేర్చినట్లుగా ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం హామీని వెంటనే ప్రారంభించాలని, శనివారం వరకు ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున హామీని అమలు చేయలేక పోయామని ప్రభుత్వం దాటవేసిందన్నారు. ఎఫ్ఐఆర్ కేసులతో సంబంధం లేకుండా నిజమైన ప్రతి ఉద్యమ కారుడికి హామీలను అమలు చేయాలని, తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించడానికి ఒక కమిటిని ఏర్పాటు చేసి, ఉద్యమకారులందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఉద్యమ కారులతోపాటు ఫోరం ప్రధాన కార్యదర్శి పట్లోళ్ళ సురేందర్‌రెడ్డి, కన్వీనర్లు గుండేటి ఐలయ్యయాదవ్, గుర్జని వెంకటేష్ గౌడ్, ఉండాటి లాలయ్య, ఉపాధ్యక్షులు కొంతం వీరాస్వామి, బి.ఇంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రధానిగా నరేంద్రమోడీ ప్రమాణ స్వీకారం పట్ల హర్షం**

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** భారతదేశ ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రజల అశీస్సులతో ముచ్చటగా మూడవసారి ప్రమాణ స్వీకారం చేయడం పట్ల జాతీయ ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడిశెట్టి పశుపతి హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మంత్రివర్గ సభ్యులకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాడిక్కడ జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధాని మోదీ సరికొత్త నిర్ణయాలను తీసుకుని యువత మరింత అభివృద్ధి చెందటానికి మరింతగా కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు టి. ప్రతి మ, వీర మల్ల కళ్యాణ్, ఎం.సురేందర్, ఎస్.రమేష్, డి.కె.పాండే, రాజు రంజన్ ప్రసాద్, టి.దయాకర్, విజశ్రీ పాల్గొన్నారు.

## జనసేన ఎమ్మెల్యే సత్యనారాయణకు ఘనంగా సత్కారం


సత్యనారాయణను సత్కరిస్తున్న టి.పద్మారావు

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** ఎపిలోని అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టితో జనసేన ఎమ్మెల్యేగా ఎన్నికైన జి.సత్యనారాయణను ఆదివారం నాడిక్కడ రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ), ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేసింది. ఆర్‌పిఐ చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు, స ంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కడారం వినయ్‌కుమార్, కోశాధికారి బాపనపల్లి ప్రమోద్‌కుమార్ తదితరులు సత్యనారాయణను శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో సత్యనారాయణ మరిన్ని పదవులను అలంకరించి ప్రజల సంక్షేమానికి అంకితం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాసరి ప్రభు, అప్పల రాజు, వినయ్‌కుమార్, రాజు, ముజీబ్, మోహన్‌కృష్ణ, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

**గంగా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం**

**నేరేడ్‌మెట్, జూన్ 9 ప్రభాతవార్త :** నేరేడ్‌మెట్ పరిధిలోని గంగా చారిటబుల్ ట్రస్ట్ అదినేత బిర్రు బాలమల్లయ్య ఆధ్వర్యంల ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 500 వందల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘసేవకులు సెర్ల అనిల్, బిర్రు హరి, సుందర్, బిర్రు బాలచందర్, బిర్రు విజయ, బిర్రు అరుణ్ పాల్గొన్నారు.

## విద్యార్థిని చదువుకోసం సహృదయం చాటిన కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

**నిజాంపేట్, జూన్ 9, ప్రభాతవార్త**
నిజాంపేట్ 12వ డివిజన్ ఇందిరమ్మ కాలనీ ఫేస్2కు చెందిన కృష్ణ, సంగీతల కుమార్తె భూమిక ఇంజనీరింగ్ 3వ సంవత్సరం చదువుతోంది. తమ పాప ఉన్నత చదువు నిమిత్తం తమ ఆర్థికస్థితిని నరసింహా యాదవ్‌తో కలిసి ఆదివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించగా.. కొలన్ శ్రీనివాస్‌రెడ్డి సానుకూలంగా స్పందించి భూమికి ఫీజు నిమిత్తం తనవంతుగా యాభైవేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరాలని, మీకోసం కష్టపడే తల్లిదండ్రులను ప్రేమగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరసింహాయాదవ్, శ్రీనివాస్, భూమిక తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థిని భూమికి తల్లిదండ్రులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

**ఉచిత వైద్య సేవలు అందించేందుకు ముందుకు రావాలి**
**-ఎమ్మెల్యే పద్మారావు గౌడ్**

**సికింద్రాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** బౌద్ధనగర్‌లోని ఎస్ఆర్‌వీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ప్రారంభించారు. ప్రత్యేకంగా అస్తమా, ఫల్మనాలజీ విభాగాలకు సంబంధించిన జబ్బులు గుర్తించి ఉచితంగా వైద్యం అందించేందుకు ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు జరిపారు. కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ వైద్య రంగంలో పేదలకు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తగిన వైద్య సేవలు అందించేందకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యా, వైద్య రంగాలకు తగిన ప్రోత్సాహన్ని అందిస్తున్నామని, వాటిని పేదలకు చేరువలో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఎస్ఆర్‌వీ మల్టీ స్పెషాలిటి క్లినిక్, చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుంకు రాంచందర్, ప్రముఖ ఫల్మనాలజీ డా. ఎండీ సమీర్ ఆహ్మద్, మేనేజర్ మహ్మద్ రబ్బాని తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ అభివృద్ధికి పాటుపడతా : పరశురామ్

**కంటోన్మెంట్, జూన్ 9 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ నియోజకవర్గం మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ఎస్సీ యువజన సంఘం అధ్యక్షులుగా జంగిటి పరశరాములు, ఉపాధ్యక్షులుగా గుర్రపు అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శిగా మారపాక అఖిల్ తేజ, కోశాధికారిగా తాటికాయల జాన్‌లు గత నెల 26న జరిగిన ఎన్నికల్లో విజయం సాధించగా ఆదివారం మారేడ్‌పల్లిలోని జిహెచ్‌ఎంసి మల్టీపర్‌పస్ ఫంక్షన్ హాల్‌లో అడ్వైజర్ కమిటీ ప్రతినిధులు ఇప్పల రాములు, గొట్టె రమేశ్, తాటికొండరాముల చేత ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు కంసాని బాబు, సంఘం సభ్యులు శంకర్, భాస్కర్, తాడూరి అంజయ్య, నర్సింగ్, స్వామి, విల్‌సన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గ అధ్యక్షులు పరశరామ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు అతీతంగా బస్తీ అభివృద్ధి కోసం, దళితుల సంక్షేమం కోసం పాటుపడుతామన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే ఉంటుంది**

**హైదరాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నప్పుడు విద్యార్థులు ముఖ్యమైన అంశాలను అవగాహన చేసుకుని పఠనం చేస్తే సులువుగా పరీక్షలు పాస్ అవుతారని ప్రముఖ ఉపాధ్యాయులు నూక లింగమూర్తి సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు తరగతుల్లోనే ఉంటుందని, కాలం వృదా చేయకుండా పాఠాలు సక్రమంగా విన్న విద్యార్థులకు మంచి భవిష్యతు ఉంటుందన్నారు. వర్గిల్‌లోని జెడ్‌పిహెచ్‌ఎస్‌లో 27 సంవత్సరాలు ఉపాధ్యాయుడిగా సేవలు అందించి, పదవి విరమణ చేసిన లింగమూర్తిని ఆదివారం శ్రీకర సత్య సేవా సహకార సమాఖ్య వ్యవస్థాపకుడు, హైకోర్టు న్యాయవాది నూతి శ్రీకర్‌శర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రయోజకులై సమాజాభి వృద్ధికి పాటుపడాలని, దేశానికి సేవలు అందించాలని సూచించారు. ఉపాధ్యాయుల సేవలను సమాజంలోని ప్రతి ఒక్క రూ గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా నూతి శ్రీకర్‌శర్మ 40 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో గరికపాటి వెంకటరామయ్య, మని గండ్ల శ్రీనివాస్‌గుప్తా, ఎం.కిష్టయ్య, ఉపాధ్యాయుడు మహి పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం
-మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్, జూన్ 9 ప్రభాతవార్త :** బిజెపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ రాష్ట బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. భారత దేశ ప్రధాన మంత్రిగా మూడవ సారి నరేంద్ర దామోదర్ దాస్ మోదీ ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆదివారం పాతబస్తీ దారుషిఫాలో చార్మినార్ నియోజకవర్గం బిజెపి నాయకులు కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం బిజెపి నాయకులు ప్రవీణ్ కుమార్, మహ్మద్ వసీముద్దీన్, దిగ్విజయ్ జైన్, నవాబ్ సఫత్ అలీ ఖాన్, దియానత్ అలీ ఖాన్, ప్రదీప్ జైశ్వాల్, మహ్మద్ హసీంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి సమావేశం


సమావేశంలో పాల్గొన్న భాగ్యనగర్ శ్రీ మహాకాంళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు

**చార్మినార్, జూన్ 9 ప్రభాతవార్త :** భాగ్యనగర్ శ్రీ మహాకాంళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి సర్వసభ్య సమావేశం పాతబస్తీ మీరాలంమండిలోని శ్రీ మహాంకాళేశ్వర మందిరంలో కమిటి అధ్యక్షులు గాజుల అంజయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భాగ్యనగర్ శ్రీమహాకాంళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి అధ్యక్షులు గాజుల అంజయ్య మాట్లాడుతూ బోనాల జాతర ఉత్సవాలు ప్రారంభానికి ముందే పాతబస్తీలో అభివృద్ధి పనులు జరిగేలా అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. పాతబస్తీలోని దేవాలయాల కమిటి ప్రతినిధులు దేవాలయాల వద్ద చేపట్టవలసిన అభివృద్ధి పనుల వివరాలు తనకు అందజేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆయన తెలియజేశారు. పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలు అత్యంతవైభవంగా నిర్వహించటానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ శ్రీ మహాకాంళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి ప్రతినిధులు సదానంద్ యాదవ్, మధుసూధన్ యాదవ్, హంసరాజ్, మధుసూధన్ గౌడ్, మాణిక్ ప్రభు గౌడ్‌లు పాల్గొన్నారు

# కన్నులపండువగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు

**నవరసభరిత పదవిన్యాసం నాట్యం : డా. ఎం.కె.రాము**

**నాంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త :**
భారతీయ శాస్త్రీయ, సంప్రదాయ, జానపద కళల్లోని సంగీతం, నృత్యకళలను పిల్లలతో నిర్వహించడం చాలా ఇష్టమని వారి నవరసభరిత పదవిన్యాసం నాట్యం అభినయభాష్యమని చమత్కరించారు. పిల్లలు మన కళలను భావితరాలకు అందించాలని కోరుతూ ముందుగా తల్లిదండ్రులు వారికి నేర్పించాలన్నారు. ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థలు శ్రీ మహతి అకాడమీ, తెలంగాణ కళాజాగృతి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బొగ్గులకుంట తిలక్‌నగర్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలను పురస్కారించుకొని ఆయా సంస్థల శిష్యబృందంచే ప్రదర్శింపబడిన సాంస్కృతిక సంబూరాల సరాగాలు సుమధురంగా సాగి అంబరాన్నంటి విచ్చేసిన అశేష కళాప్రియులను ఉత్తేజపరిచి ఉర్రూతలూగించాయి. కళాభారతి ఎస్పీ భారతి సభాధ్యక్షతన జరిగిన సభాకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రభుత్వ జవహర్ బాలభవన్ పూర్వ డైరెక్టర్ డా. ఎం.కె.రాము విశిష్ట అతిథులు ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, సివిపి.అంజనీకుమారి, ఎం.గోపి, సిపిఐ చాడ వెంకటరెడ్డి, పల్లె నర్సింహ, సురేందర్, నిర్వాహకుడు పద్మావెంకటేష్ తదితరులతో కలిసి కళాకారులను, గురువులను, పలువురు ప్రముఖులను తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల్లో ఘనంగా సత్కరించారు.


రేలంగి నరసింహారావును సత్కరిస్తున్న ఎం.కె.రాము, చాడ వెంకటరెడ్డి, పద్మావెంకటేష్, భారతి తదితర అతిథులు

## తన్మయుల్ని చేసిన సంస్కృతీ కళారాధన



సత్కారగ్రహీతలతో అతిథులు సురేష్, గిరిధర్, కళ్యాణ్‌శాస్త్రి తదితరులు

**నాంపల్లి, జూన్ 9 ప్రభాతవార్త :**
ప్రముఖ సాంస్కృతిక సేవాసంస్థ సంస్కృతీ సర్వీసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆదివారం ఉదయం సంస్థ అధ్యక్షులు డా. అరిపిరాల కళ్యాణ్‌శాస్త్రి నేతృత్వంలో రెండు గంటలపాటు నిర్విరామంగా సాగిన సంస్కృతీ కళారాధన కనువిందుగా సాగింది. 120మందికి పైగా చిన్నారి యువ కళాకారులు శాస్త్రీయ, సంప్రదాయ, జానపద నృత్యాలను పలు కీర్తనలు, అంశాలతో అత్యంత అద్భుతంగా ప్రదర్శించి ఆహుతుల ప్రశంసలందుకొని తన్మయుల్నిచేసి సంగీతలోకంలో ఓలలాడించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులు నటులు జెమినీ సురేష్, వెంకట గిరిధర్, నటి గీతాసింగ్, అనుపమా తదితరులు అద్భుత నాట్యప్రదర్శన కావించిన కళాకారులను కళాశ్రీ, వాద్యశ్రీ, స్వరశ్రీ, కళావిశారద బిరుదులతోపాటు ప్రశంసాపత్రాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు.

**ప్రఖ్యాత గేయరచయిత వడ్డేపల్లికృష్ణకు ఆటా ఆత్మీయ పురస్కారం**

**రవీంద్రభారతి, జూన్ 9 ప్రభాతవార్త :** జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్, అట్లాంటా, జార్జియా అమెరికాలోని అమెరికా తెలుగు సంఘం ఆటా ఆధ్వర్యంలో ఆటా బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ప్రెసిడెంట్ మధు బొమ్మినేని నేతృత్వంలో జూన్ 7నుండి 9వరకు మూడురోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న 18వ ఆటా మహాసభలు నిర్వహిస్తున్న విషయం మా పాఠకులకు తెలిసిందే. ఇందులో భాగంగా ఈరోజు ఆదివారం రవి నీరెల్లి, అప్సర్ ఆధ్వర్యం నిర్వహించిన ఆటా సాహిత్య సదస్సులో ప్రఖ్యాత గేయరచయిత, కవి డా. వడ్డేపల్లి కృష్ణను ఘనంగా సత్కరించి ప్రతిష్టాత్మక ఆటా ఆత్మీయ పురస్కారం, జ్ఞాపికను ప్రదానం చేశారు. అంబికా అనంత్, సాయి లక్కరాజు తదితరులు పాల్గొన్న ఈ సదస్సులో డా. వడ్డేపల్లి కృష్ణ సినీగీతాలు, లలితగీతాల గురించి సోదాహరణగా ప్రసంగించి అందరి ప్రశంసలందుకున్నారు.

**సిసిరోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్**

**తార్నాక, జూన్ 9 ప్రభాతవార్త :** నూతనంగా రూ. 54లక్షల వ్యయంతో నాచారంలో వేస్తున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పరిశీలించారు. నాచారం జాన్సన్ గ్రామర్ హైస్కూల్ వైపు వెళ్లే రోడ్డు నిర్మాణం పనులు కొన్ని అనివార్యకారణాల వల్ల వేయడంలో ఆలస్యం అయిందని కార్పొరేటర్ పేర్కొన్నారు. ఇప్పటికే రాఘవేంద్రనగర్ చుట్టుపక్కల అన్ని కాలనీల్లో సీసీ రోడ్డు వేయిస్తామని కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ చెప్పారు. పనుల్లో నాణ్యతప్రమాణాలు పాటించేలా అధికారులతోల కలిసి తరుచు పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిజన్ శేఖర్, మేకల ముత్యం రెడ్డి, కట్టబుచ్చన్న గౌడ్, శ్రీను నాయక్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**26న ఘనంగా ఐఎన్‌టియుసి 75వ వసంతాల వేడుక**

**బేగంబజార్, జూన్9ప్రభాతవార్త:** జాతీయ ఐఎన్‌టియుసి అధ్యక్షులు మాజీ రాజ్యసభసభ్యులు డాక్టర్ జి.సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఐఎన్‌టియుసి జాతీయ 75వ వసంతాల వేడుకలను ఘనంగా జరుపుకొనున్నట్లు ఐఎన్‌టియుసి వర్కింగ్ అధ్యక్షులు, మున్సిపల్ సహకార మజ్దూర్ యూనియన్ నాయకులు అదిల్‌షరీఫ్ తెలిపారు. ఈ వేడుకలను ఈనెల26వ తేదిన జరిగే వేడులకు తెలంగాణ మంత్రి పొన్నం ప్రబాకర్‌గౌడ్ విచ్చేయనున్నట్లు తెలిపారు. మంత్రిన్ని శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలోఐఎన్‌టియుసి నాయకులు జనక్‌ప్రసాద్, ఆర్‌డి.చంద్రశేఖర్, విజయ్‌కుమార్ యాదవ్, కె.శివకుమార్, జయప్రకాష్, ఖాజాపాషా తదితరులు పాల్గొన్నారు.

**తెలంగాణ దశాబ్ది ఏడాది పొడవునా జరగాలి**
**-విశ్రాంత జడ్జ్ బూర్గుల మధుసూదన్**

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ది పూర్తయిన సందర్భంగా ఏడాది అంతా కార్యక్రమాలు జరగాలని విశ్రాంజ న్యాయమూర్తి బూర్గుల మధుసూదన్ అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమి అధినేత విక్కి మాస్టర్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువు సునీతారాణి శిష్య బృందం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా 'జానపద శాస్త్రీయ నృత్య' ప్రదర్శనలు అందరిని అలరించింది. ఈ సందర్భంగా అతిథులుగా విశ్రాంత జడ్జ్ బూర్గుల మధుసూదన్, బిఆర్ఎస్ నేత నాగేష్‌మూదిరాజ్ తదితరులు హాజరై నృత్యకళాకారులను సత్కరించి అభినందించారు. సంస్థ వ్యవస్థాపకులు విక్కి మాస్టర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతిని కళలను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బాలనర్తకి తోకల సాయి సుప్రీతిలకు నాట్యమయూరి అవార్డును అందించి అభినందించారు.

**ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేక వేడుకలు**

**యూసుఫ్‌గూడ, జూన్ 9, ప్రభాతవార్త :** శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం వేడుకలను అల్లాపూర్ డివిజన్ పరిధిలోని వివేకానందనగర్ కాలనీ చౌరాస్తాలో నియోజకవర్గం కాన్స్టిట్యూయెన్సీ హిందువాహిని బాగ్ కన్వీనర్ సిహెచ్ శ్రీనువాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో డివిజన్ నాయకులు సిహెచ్ వెంకటరామిరెడ్డి, బాగ్ కోకన్వీనర్ వంశీకృష్ణ, రామ్‌గోపాల్ సింగ్, జి.రాజు, పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్, జి.సుదర్శన్, లాల్‌సింగ్, గంగాధర్, రాకేష్ యాదవ్, జీతు, సందీప్‌నాయక్, నవీన్, వెంకటరెడ్డి, మురళీమోహన్, అంకిత్ సింగ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో లారీ డ్రైవర్ హత్య

**అత్తాపూర్ జూన్9, ప్రభాతవార్త :** మద్యం మత్తులో లారీ డ్రైవర్‌ని తోటి స్నేహితులు దారుణంగా హత్య చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్‌పెక్టర్ వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం...అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని సులేమాన్ నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ లాయిక్(30)ను శనివారం అర్ధరాత్రి ముగ్గురు స్నేహితులు అత్తాపూర్ పిల్లర్ నెంబర్ 258 వద్దకు మద్యం తాగేందుకు తీసుకెళ్లారు. అక్కడ ఏం జరిగిందో ఏమో కాని మద్య సీసాలు పగలగొట్టి అతని గొంతు కోసి దారుణంగా హత్య చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. యువకుడి హత్యతో ఒక్కసారిగా కలకలం రేగింది. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

## ప్రధానిగా మూడోసారిగా ఎన్నికైన మోదీకి అభినందనలు
-ఇప్పటికైనా బిసిల డిమాండ్లు అమలు చేయాలి
-రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**
ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ మూడోవసారి ఎన్నికైనందుకు రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అభినందనలు తెలియజేశారు. గత పది సంవత్సరాలుగా బిజెపి పాలనలో బిసిలకు ఏ ఒక్క చిన్న పథకం కూడా కల్పించలేదని, ఈ దఫా ఎన్నికల్లో బిసిలు ఆగ్రహంతో వాత పెట్టారని ఇప్పటికైనా బిసిల ఆగ్రహాన్ని గుర్తించి బిసిలకు పార్లమెంట్‌లో బిల్లు పెట్టి చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే జాతీయ స్థాయిలో విద్యార్థులకు పూర్తి ఫీజుల రీయంబర్స్‌మెంట్ పథకం-స్కాలర్‌షిప్‌ల పథకం ప్రవేశపెట్టాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని, ప్రతి బిసి, ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి 20 లక్షలు ఆర్థిక సహాయం అందించి అభివృద్ధి చేయాలని ఆదివారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రధాని మోదీ బిసి సామాజిక వర్గానికి చెందినవారై ఉండి కూడా బిసిల అభివృద్ధికి ఒక్క చిన్న పథకం కూడా ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొనకపోవడంతో దేశంలోని 70 కోట్ల మంది బిసిలు జీర్ణించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 76 సంవత్సరాల తరువాత 70 కోట్ల మంది బిసి ప్రజలకు వాటా ఇవ్వారా ?, ఇది ప్రజాస్వామ్య దేశమని, బిసిలు బిచ్చగాళ్ళు కాదని, వాటాదారులని, వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు చేస్తారని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఇప్పటికైనా బిసి విద్యార్థులకు జాతీయ స్థాయిలో ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం, స్కాలర్‌షిప్‌ల పథకం అమలు చేస్తామని, కేంద్రంలో బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బిసిల అభివృద్ధికి బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు కేటాయిస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

## చేతుల్లో ఆరోగ్య పుస్తకం ప్రతి ఇంట్లో ఉండాలి : డాక్టర్ రాజారెడ్డి

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** మానవ జీవిత కాలం పెరుగుతున్న క్రమంలో, ఎదురవుతున్న అనేక దీర్ఘకాలిక జబ్బులపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సి న అవసరం ఉందని నిజామ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) మాజీ డైరెక్టర్ డాక్టర్ రాజారెడ్డి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యురాలు డాక్టర్ ప్రతిభాలక్ష్మి రచించిన 'చేత(తు)ల్లో ఆరోగ్యం' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి రోజు 19 మంది రోడ్డు ప్రమాదాలు బారినపడి మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తంచేస్తున్నారని అన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. మానవ జీవితకాలం పెరుగుతున్న క్రమంలో ఎదురవుతున్న అనేక దీర్ఘకాలిక జబ్బుల గురించి ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. తెలంగాణ ఆయుష్ మాజీ అదనపు సంచాలకులు డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం గురించి ఉండే అనేక సందేహాలకు, వైద్యులు అందించవలసిన సలహాలు ఇందులో ఉన్నాయన్నారు. పుస్తక రచయిత డాక్టర్ ప్రతిభాలక్ష్మి మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుకోవడం, మన ఆరోగ్యం బాధ్యత తీసుకోవడం వల్ల మన చేతల్లోనే (మన చేతుల్లోనే) మన ఆరోగ్యం ఉంటుందని తెలియజేసే ప్రయత్నమే ఈ పుస్తకం అని అన్నారు. కార్యక్రమంలో నిమ్స్, గాంధీ ఆసుపత్రికి చెందిదిన వైద్యులు, దాదాపు వంద మంది ఆరోగ్యాభిలాషులు పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రాజారెడ్డి

## రాష్ట్రంలో పెరిక కుల సంఘాన్ని మరింత బలోపేతం చేస్తాం
-రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య


జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య, చిత్రంలో సుంకరి ఆనంద్ తదితరులు

**చిక్కడపల్లి, జూన్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పెరిక కుల సంఘాన్ని మరింత బలోపేతం కావాల్సి న అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దా లింగయ్య అన్నారు. ఆదివారం బాగ్‌లింంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం ఆధ్వర్యంలో 25వ ప్రపంచ పెరిక కుల వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమం కన్వీనర్ సుంకరి ఆనంద్ పర్యవేక్షణలో జరిగింది. మద్దా లింగయ్య, సుంకరి ఆనంద్ మాట్లాడుతూ పెరిక కులస్తులు రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో రాణించాలన్నారు. సుమారు 55 జంటలకు అక్కడికక్కడే వివాహ కుదిరినట్లు నిర్వాహకులు తెలిపారు. సుంకరి ఆనంద్ మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా పెరిక కుల వేదికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇలాంటి వేదికలను కులస్తులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాదాపు 300 మందికిపైగా పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ ఆత్మగౌరవ కమిటీ చైర్మన్ గటిక విజయకుమార్, తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం ప్రధాన కార్యదర్శి భూస్వామి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బత్తిని పరమేష్, చండిక కిషోర్, మనోహర్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రపంచ పెరిక కుల వధూవరుల వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది.

# జాతీయ క్రీడలలో మర్రి లక్ష్మారెడ్డి విజయం
-రెండు స్వర్ణాలు గెలిచిన హైదరాబాద్ వెటెరన్ ఎథ్లెట్

**హైదరాబాద్, జూన్ 9, ప్రభాతవార్త:**
జాతీయ స్థాయి స్పోర్ట్స్‌లో విజయం సాధించిన హైదరాబాద్ వెటెరన్ ఎథ్లెట్, ఎమ్.ఎల్.ఆర్ ఐటీ విద్యా సంస్థల చైర్మన్ మర్రి లక్ష్మా రెడ్డి(77) నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని మల్కాజ్ గిరి శాశన సభ్యులు మర్రి రాజశేఖర రెడ్డి కొనియాడారు. ఈ నెల 7,8,9వ తేదీలలో గుజరాత్‌లో జరుగుతున్న మాస్టర్స్ గేమ్ ఫెడరేషన్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఈత పోటీల్లో 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లోని 3 నిమిషాల 32 సెకెన్లలో రేసును పూర్తి చేసి అగ్రస్థానం దక్కించుకున్నారు. అలాగే 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో కూడా ప్రథమ స్థానం కైవశం చేసుకున్నారు. 4 నిమిషాల 16 సెకెన్లలో రేసును ముగించేశారు. నిత్యం క్రీడలలో చురుగ్గా పాల్గొనే మర్రి లక్ష్మారెడ్డి సైక్లింగ్, స్విమ్మింగ్, రన్నింగ్‌లో నిష్ణాతులనే విషయం తెలిసిందే. వ్యాయామం పట్ల తీక్షణమైన శ్రద్ధ కనబరుస్తారని ఆయనకి పేరుంది. ఈ నేపథ్యంలో గుజరాత్‌లో జరిగిన క్రీడా పోటీలలో మొదటి స్థానంలో నిలిచి రెండు స్వర్ణ పతాకాలను కైవశం చేసుకున్నారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర రెడ్డి, ఎమ్.ఎల్.ఆర్.ఐటీ ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాసరావు ఆయనకు అభినందనలు తెలిపారు.




## మోదీ, చంద్రబాబుల ప్రమాణ స్వీకారం దళితులకు చీకటి రోజు

**సైఫాబాద్, జూన్ 9 ప్రభాతవార్త:**
నరేంద్రమోదీ ప్రధానిగా, చంద్రబాబునాయుడు ఎపి సిఎంగా ప్రమాణస్వీకారం చేయడం దళిత బహుజన జాతులకు చీకటి రోజులని (బ్లాక్ డే) దళిత బహుజన పార్టీ జాతీయ (డిబిపి) అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ చెప్పారు. దేశంలో అప్రజాస్వామిక, నియంతృత్వ, అరాచక, హంతక పాలన చేసిన నరేంద్రమోదీ నాయకత్వంలో బిజెపి మూడోసారి కేంద్రంలో ప్రభుత్వంను ఏర్పాటు చేయడం నిమ్న జాతుల భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని ఆయన ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ రూపొందించిన దేశ రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తామని మోదీ ఎన్నికల ముందు ప్రకటించి నేడు రాష్ట్రపతి భవన్‌లో ఆదే రాజ్యాంగంపై ప్రమాణస్వీకారం చేయడమంటే రాజ్యాంగ గొప్పతనమని ఆయన తెలిపారు. గతంలో వీరి పాలనలో దళిత బహుజన జాతులకు తీరని అన్యాయం జరిగిందని, ప్రస్తుతం ఈ జాతుల జీవన మానవ హక్కులు కాలరాసే ప్రమాదం ఉందన్నారు. రాజ్యాంగ హక్కులు, రక్షణ చట్టాల కోసం మోదీ సర్కార్‌పై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఎపిలో ఎన్‌డిఎ కూటమి టిడిపి, జనసేన, బిజెపి ఎన్నికల్లో గెలుపొందడం అంతా ఈవిఎం ట్యాంపరింగ్ మాయాజాలమన్నారు.

మోదీ కేంద్ర ఎన్నికల కమిషన్ అండదండ లతో ఎన్‌డిఎ కూటమి ఈవిఎంలను రిమోట్ హ్యాకింగ్ ద్వారా ట్యాంపరింగ్ చేసి గెలిచినట్లు ప్రకటించుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలో ఈ నెల 12న ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వంను ఏర్పాటు చేస్తూ ప్రమాణ స్వీకారం చేయడం దళిత బహుజన జాతులకు దుర్దినమని ఆయన ఎద్దేవ చేశారు. ఈ మనువాదుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బహిష్కరించాలని కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు.

